# జవాబు

ఆఫీసు నుండి సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి వచ్చిన గంగాధరంకు గడప దగ్గరే, నాలుగేళ్ళ ఏకైక సుపుత్రుడు, అందునా ఇద్దరాడపిల్లల తర్వాత పుట్టినవాడు, ఎదురై భోరున ఏడుస్తూ కాళ్ళను వాటేసు కున్నాడు.

ఆ ఏడ్పుకు గుండె కరగడమంటూ వుంటే గంగాధరం గుండె కరిగిన మాట నిజం! అతనికి రోజుకు రెండు మూడు సార్లయినా తన ఒక్కగానొక్క కొడుకు కారణంగా గుండె కరుగుతూనే వుంటుంది.

"నా తండ్రీ! నా బుజ్జే" అంటూ వాణ్ణి వెంటనే ఎత్తుకొని "యాట్రాఏడుస్తా వుండావు" అని అడిగాడు. వాడు అతనికి అరోప్రాణం. మిగతా ఐదు ప్రాణాల సంగతీ నిజంగా అతడికి తెలీదు.

"అమ్మ కొట్టింది" అన్నాడు వాడు ఏడుపును మరింత పెంచే ప్రయత్నం చేస్తూ... "అమ్మ కొట్టును" అన్నది వాని సిద్ధాంతం... వాని సిద్ధాంతాన్ని మరింత సాగదీస్తే నాన్న ఎప్పుడూ కొట్టడు అన్నది కూడా అందులో భాగమే.

గంగాధరానికి బాగా కోపం వచ్చింది. కాఫీ చికాకు సంగతలా ఉంచి తన వంశోద్ధారకుని వంటి మీద దెబ్బ! ఆ కొట్టింది కూడా వాణ్ణి కేవలం కన్న యంత్రమాయె!

నేరుగా వంటింటి గడప దగ్గరకు వెళ్ళి లోపల భార్య వుందా లేదా అని కూడా గమనించకుండా (వుండక ఎక్కడ ఛస్తుంది) "బాబును కొట్టావంటనే మల్లా ఏం రోగమొచ్చింది" అనడిగాడు చాలా తీవ్రంగానే.

లోపల వున్న భార్య అతని ముఖంలోకి చూసి "బాబును కొట్టక నిన్ను కొట్ట మంటావా?" అని అందామనుకొని అపుకొని తన పనిలో మునిగి పోయింది.

తనేదన్నా అంటే సమాధానం రాకపోతే (ఒక్క భార్య విషయంలోనే) గంగ వెర్రులెత్తుతుంది గంగాధరానికి. "నీకే చెప్పేది" అన్నాడు గద్దిస్తూ.

అప్పటికీ ఆమె మాట్లాడలేదు. సమాధాన మివ్వదగిన ప్రశ్నలా ఆమెకది అనిపించలేదు... ఒకపూట ప్రశ్న ఒకనాటి ప్రశ్న అయితే గదా! రోజూ వుండేదే! తను వాణ్ణి కొట్టడమూ వాడేడ్చటమూ, ఈ పెద్దమనిషి గద్దించటమూ... ...

గంగాధరం గట్టిగా జుట్టు పీక్కోవాలనుకున్నాడు. తనజుట్టు కాకపోతే భార్య జుట్టయినా. కానీ ఈ మధ్య భార్య జుట్టు మరీ పొట్టిదైపోయింది. ఆమె జుట్టు పొట్టి గావటానికి కారణాలు కనుక్కోమని ఒక కమిటీని వేస్తే నిస్సందేహంగా దోషి స్థానంలో గంగాధరమే నిలబడతాడు.

"మనిషైనాక బుద్ధుండాలి! చీటికీ మాటికీ పసిపిల్లవాణ్ణి కొట్టడానికి నీవి చేతులైతే గదా..." గంగాధరం వంటింటి గడపలో నిల్చొని వాగుతూనే వున్నాడు.

"నీది నోరైతే గదా..." గొణుక్కుంది పొయ్యిలో కట్టెలు ఎగదోస్తూ ఆవిడ.

లోపలకు నాలుగడుగులు వేశాడు గంగాధరం. ఆమె అతని రాకను గుర్తించనట్టే పొయ్యి వూదటంలో మునిగి పోయింది. పొయ్యిలోని ఎర్రని మంటలు ఆమె ముఖం మీద నీడల్లా పారాడు తున్నాయి. ముక్కు మీదున్న పాత ఎర్రటి పుడక మరింత ఎర్రగా క్షణకాలం మెరిసింది.

ఆమె మౌనం, నిర్లిప్తత, గంగాధరం భరించలేక పోతున్నాడు. కనీసం భయపడ్డట్టు కూడ ఆమె ముఖం పెట్టలేదాయె! ఇది మరీ అవమానంగా వుంది. ఆమె నోటినుండి ఏదో కక్కిస్తే తప్ప అతని ప్రాణం కుదుట పడేట్టులేదు.

"నీ యవ్వారం చూస్తూంటే వాన్ని బతక నిచ్చేటట్టు లేవు" చాలా గట్టిగానే గదమాయించాడు.

"నువ్వు మాత్రం నన్ను బతకనిచ్చేటట్టుండావా" నోటిదాకా వచ్చిన మాటల్ని పెదవుల మధ్యనే అపుకొందామె. చేత్తో గరిటె తీసుకొని పొయ్యి మీద పాత్రలో ఒకటి రెండుసార్లు తిప్పింది.

గంగాధరం పిల్లవాణ్ణి కిందకు దింపాడు. వాడు భయం నటిస్తూ తండ్రి మోకాళ్ళ దగ్గరే నిలబడ్డాడు... వాడికి మహా ఉబలాటంగా వుంది... ఏదో జరుగుతుందని...

గంగాధరం మరో మూడడుగులు ముందుకు వేశాడు – ఆమె తలెత్తి అతని ముఖంలోకి అరక్షణం చూసి మళ్ళీ తల దించుకొని పుల్లల్ని పొయ్యిలోకి ఎగదోసే పనిలో వుండి పోయింది.

"కనేదాంట్లో వుండే శ్రద్ధ పిల్లల్ని పెంచే దాంట్లోనూ వుండాలి" అంటూ ఆమెకు చాలా దగ్గరగా వచ్చాడు గంగాధరం.

"నీయట్టాంటి మొగుడుంటే పెంచినట్టే" పెదవులు కదిలేలా చాలా సన్నగా గొణగిందామె.

"ఏందే గొణుక్కుంటున్నావు... అసలు పిల్లవాని జోలికి ఎందుకు పోయి నావంటే చెప్పకుండా, మూలి మిందేసుకుంటావా" అంటూ సర్రన ఆమె మీదికి వంగి గట్టిగా జుట్టుపట్టుకొని ఇవతలికి యీడ్చాడు.

వెనక పిల్లవాడు గొల్లుమన్నాడు. ఆ ఊపుకు ఆమె నేల మీద దభీమని పడింది. అయినా నోట మాత్రం మాట రాలేదు.

గంగాధరానికి శివమెత్తింది. వీపు మీద దబదబా గుద్దులు గుద్ది ఆమె కళ్ళలోకి రాక్షసంగా చూశాడు.

ఆమె జుట్టంతా చెదరి పోయింది. రెండు గాజులు చిట్లిపోయాయి. నుదుట మీద కుంకుమ చెదిరింది. అలాగే భర్త కళ్ళలోకి అసహ్యంగా, ఆక్రోశంగా, దీనంగా చూసింది...

చెంపమీద మళ్ళీ రెండు దెబ్బలు – "చెప్పుముండా – చెప్పు" గంగాధరం పళ్ళు పటపటమన్నాయి. అతడెత్తిన చేతులెత్తినట్లె వున్నాయి.

ఆమె చేతులు పైకడ్డం పెట్టింది. ఆమె పెదవులు కదిలాయి... ఒక్కొక్కమాటే మెల్లగా ఆమె నోటినుండి వచ్చాయి వణకుతూ.

"నీకోసం తీసి పెట్టిన కాఫీ వాడు తాగితేనూ..."

*(విపుల – జనవరి 82)*

★ ★ ★